క్లుప్తంగా

ముగిసిన గాజుల అలంకరణ



రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడు శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలో శ్రావణ మాసం సందర్భంగా ముగ్గురమ్మలకు గాజుల అలంకరణ ఆదివారంతో ముగిసింది. శ్రావణమాసం పురస్కరించుకుని భక్తుల సహకారంతో అమ్మవారిని, గర్భాలయాన్ని గాజులతో అలంకరించారు. అమ్మవారికి ప్రీతికరమైన ఈ గాజుల అలంకరణను తిలకించేందుకు గత మూడు రోజులుగా గ్రామంతో పాటు చుట్టూ పక్కల గ్రామాల భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి తరలి వచ్చారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. శ్రావణమాసం సందర్భంగా గత నెల రోజులుగా ఆలయంలో పలు ప్రత్యేక పూజలు చేశారు. మహిళా భక్తులు ఆలయ ప్రాంగణంలో వ్రతాలు ఆచరించారు. మహిళలు పాల పొంగళ్లు భక్తిశ్రద్ధలతో సమర్పించారు.

యోగా, వాకర్స్ అసోసియేషన్ ఎన్నిక



నున్న(విజయవాడరూరల్): నున్న జిల్లా పరిషత్ హైస్కూల్లో ప్రతి రోజూ యోగా, వాకింగ్ చేసేవారు నూతనంగా యోగా, వాకర్స్ అసోసియేషన్‌గా ఏర్పడ్డారు. ఈ అసోసియేషన్‌కు ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నిక నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షుడిగా కలకోటి వీరారెడ్డి, ఉపాధ్యక్షుడిగా షేక్ బాజీ, ప్రధాన కార్యదర్శిగా తుమ్మల శివయ్య, సహాయ కార్యదర్శిగా కలతోటి కొండలరావు, కోశాధికారిగా దేవులపల్లి గోపాలరావు ఎన్నికయ్యారు. కమిటీని యోగా గురువు పోలారెడ్డి సాంబిరెడ్డి, గుంటక గోపాలరెడ్డి తదితరులు అభినందించారు.

ఘనంగా వెంకయ్యస్వామి దివ్య ఆరాధన ఉత్సవాలు



మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్ కొబ్బరితోటలో ఆదివారం శ్రీభగవాన్ వెంకయ్యస్వామి దివ్య ఆరాధన ఉత్సవాలు ఘనంగా జరిగాయి. భగవాన్ వెంకయ్యస్వామి వారికి ప్రత్యేక పూజలు, అర్చనలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు వెంకయ్యస్వామి పారాయణం చేశారు. ఎమ్మెల్యే బొండా ఉమా మహేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొని మధ్యాహ్నం అన్నప్రసాద వితరణను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ స్వామివారి ఆశీస్సులతో సెంట్రల్ నియోజకవర్గ ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. పద్మశాలీ కార్పొరేషన్ డైరెక్టర్ సింగం వెంకన్న, కార్పొరేటర్ కొంగితల లక్ష్మీపతి, పీవీఆర్, భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

300 మందికి వైద్య సేవలు

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం కానుమోలులో ది హనుమాన్‌జంక్షన్ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. గ్రామంలోని జెడ్పీ హైస్కూల్ ప్రాంగణంలో నిర్వహించిన వైద్య శిబిరంలో హృదయాలయ ఆస్పత్రి (విజయవాడ)కు చెందిన వైద్యులు సేవలు అందించారు. రక్తపోటు, మధుమేహం, గుండె, కంటి, దంత సంబంధిత వ్యాధులకు ఉచితంగా వైద్యం అందించారు. ఈసీజీ, ఎకో పరీక్షలను ఉచితంగా నిర్వహించారు. డాక్టర్ శివరామ్ ప్రసాద్, డాక్టర్ బళ్లా నాగార్జున, డాక్టర్ దాట్ల దివ్య, డాక్టర్ సూర్య వంశీ, డాక్టర్ నాదెళ్ల విష్ణువర్ధన్, డాక్టర్ స్వాతి, డాక్టర్ యువాన్‌లు వైద్య సేవలు అందించారు. సుమారు 300 మందికి ఉచిత వైద్య సేవలు చేయటంతో పాటుగా మందులు పంపిణీ చేశారు. ది హనుమాన్‌జంక్షన్ రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు యర్రంశెట్టి సాయి సదా స్వప్నకుమార్, రైస్‌మిల్లర్లు పొట్లూరి ప్రసాద్, శ్రీరామమూర్తి, బళ్లా వీరవెంకట్రావు, కొండా హరికిషన్‌రాజు, లింగమల్లు సంతోష్, పీఎస్ఆర్ ప్రసాద్, కొమ్మన వెంకట శ్రీధర్, పీఏసీఎస్ చైర్మన్ దన్నె దుర్గారావు, మాజీ సర్పంచ్ చింతల వెంకట శివ అప్పారావు పాల్గొన్నారు.

రౌడీషీటర్లు, సస్పెక్ట్‌లకు కౌన్సెలింగ్

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్‌లు, టాస్క్‌ఫోర్స్ కార్యాలయం వద్ద ఆదివారం రౌడీషీటర్స్, సస్పెక్ట్‌లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. నేర పవృత్తిని విడనాడాలని అధికారులు సూచించారు. మంచి నడవడిక, సత్ప్రవర్తనతో మెలగాలని, ఎలాంటి అసాంఘిక కార్యకలాపాల్లో పాల్గొనడం చేయరాదని సూచించారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాల వినియోగం, అక్రమ రవాణా నిరోధించాలని చెప్పారు. ప్రతి ఒక్కరిపై పోలీస్ నిఘా ఉంటుందని గొడవలు, ఇతర నేరాల్లో పాల్గొంటే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

వేడుకలకు విగ్రహాలు ముస్తాబు

- గ్రామాల్లో మొదలైన వినాయకచవితి సందడి
- మండలంలో 200 వినాయక పందిళ్లు
- అందుబాటులో మట్టి వినాయక విగ్రహాలు
- వినాయక ఉత్సవాలకు కఠిన నిబంధనలు



మట్టి వినాయకుడి విగ్రహాలను సిద్ధం చేస్తున్న బెంగాల్ కళాకారులు



అమ్మకానికి సిద్ధంగా పీవోపీ వినాయకుడి విగ్రహాలు

పెనమలూరు: గ్రామాల్లో వినాయకచవితి సందడి మొదలైంది. మండల పరిధిలో వినాయ చవితి ఉత్సవాలు పెద్ద ఎత్తున నిర్వహించేందుకు భక్తులు ఏర్పాట్లు చేస్తున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది వినాయక చవితి ఉత్సవాలకు దాదాపు 200 పందిళ్లు గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్నారు.

అనుమతులకోసం ఆన్‌లైన్లో..

పోలీసుల సూచన మేరకు ఆన్‌లైన్‌లో అనుమతుల కోసం దరఖాస్తులు చేశారు. అయితే వినాయక చవితి ఉత్సవాలకు పోలీసులు కఠిన నిబంధనలు పెట్టడంతో భక్తులు కొంత అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. తాడిగడప మున్సిపాలిటీ, పెనమలూరు మండలాల్లో వినాయకచవితి ఉత్సవాలు భారీగా నిర్వహించేందుకు భక్తులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. ఇప్పటికే పందిళ్లు వేశారు. వినాయకుడి పండుగ బుధవారం కావటంతో చురుకుగా ఏర్పాట్లు చేస్తున్నారు. వినాయకచవితి పండుగలో సమస్యలు రాకూడదని పోలీసులు హెచ్చరిస్తున్నారు.

అందుబాటులో మట్టి విగ్రహాలు

వినాయకచవితి పండుగ పూజలకు మట్టి వినాయక విగ్రహాలు అందుబాటులో ఉన్నాయి. పెనమలూరు సెంటర్ వద్ద మనగ్రామం దుకాణంతో పాటు, పలు ప్రాంతాల్లో 3, 5 అడుగుల ఎత్తులో మట్టి విగ్రహాలను తయారు చేసి ఉంచారు. గంగానది నుంచి మట్టి తీసుకు వచ్చి, బెంగాల్ కార్మికులతో మట్టి వినాయకుడి విగ్రహాలు తయారు చేయించారు. పర్యావరణాన్ని దృష్టిలో ఉంచుకొని మట్టి వినాయక విగ్రహాలు మాత్రమే తయారు చేయించామని 'మనగ్రామం' దుకాణం నిర్వాహకులు తెలిపారు. 3 అడుగుల మట్టి వినాయకుడి విగ్రహం రూ.11 వేలు, 5 అడుగుల విగ్రహం రూ.14 వేలతో పాటు పూజా సామగ్రి కూడా ఇస్తామన్నారు.

మట్టి విగ్రహాలను పూజిస్తే మేలు



వినాయక చవితి పండుగ భక్తులు ఆనందంగా చేసుకునే విధంగా అధికారులు సహకరించాలి. భక్తులు కూడా అత్యుత్సాహానికి పోకుండా భక్తిశ్రద్ధలతో పండుగ చేయాలి. మట్టి వినాయక విగ్రహాలను ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలి. పర్యావరణాన్ని పరిరక్షించాలి.


– ఎస్.వెంకటరాజు, భక్తుడు, పెనమలూరు

పీవోపీ విగ్రహాల విక్రయం

వినాయకుడి విగ్రహాలను అందంగా రూపొందించటానికి ప్లాస్టర్ ఆఫ్ పారీస్ (పీవోపీ) వినాయకుడి విగ్రహాలను కూడా మార్కెట్‌లో అమ్ముతున్నారు. మట్టి వినాయకుడి విగ్రహాల కంటే పీవోపీ వినాయక విగ్రహాలను పందిళ్లు నిర్వహించే వారు ఎక్కువగా కొంటున్నారు. ఈ విగ్రహాలు అందంగా కనబడటంతో వీటిపై మొగ్గు చూపుతున్నారు. ఈ విగ్రహాలు ఆకర్షణీయంగా ఉన్నాయి. భారీ సైజులో ఈ విగ్రహాలు అందుబాటులో ఉన్నాయి.

మట్టి విగ్రహాలపై ప్రచారం ఏది?

మట్టి వినాయకుడి విగ్రహాలపై ప్రభుత్వం ఎటువంటి ప్రచారం చేయటం లేదు. పర్యావరణాన్ని కాపాడే విషయంలో అధికారులు చొరవ తీసుకోవటం లేదు. పీవోపీ విగ్రహాలకు బదులుగా మట్టి విగ్రహాలు కొని ఉత్సవాలు చేయాలని నిర్వాహకులను ప్రోత్సహించటం లేదు. పర్యావరణ పరిరక్షణకు మట్టివిగ్రహాలనే పూజించాలని పర్యారణ నిపుణులు సూచిస్తున్నారు.



ఐదు అడుగుల మట్టి వినాయకుడి విగ్రహం

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెనమలూరు: కానూరులో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఈఈ ఆపరేషన్స్ పి.హరిబాబు తెలిపారు. ఆయన ఆదివారం వివరాలు తెలుపుతూ సోమవారం శ్రీరామ్‌నగర్ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని కేసీపీ కాలనీ ఫీడర్ మరమ్మతుల కారణంగా ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుతామన్నారు. ఈ కారణంగా రామప్రియనగర్, కేసీపీ కాలనీ, బందరు తాడిగడప జంక్షన్, వీఆర్ సిద్ధార్థ, టీసీఆర్ కాలనీ, 100 అడుగుల రోడ్డు, పంటకాలువ, సాయిబాబా గుడి ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని స్థానికులు సహకరించాలని కోరారు.

నేర చరిత్ర ఉన్న వారిపై నిఘా



చిట్టినగర్(విజయవాడపశ్చిమ): వినాయక చవితి వేడుకలను ఆసరాగా తీసుకుని శాంతి భద్రతలకు విఘాతం కలిగించాలని చూస్తే ఉపేక్షించేది లేదని, నేర చరిత్ర ఉన్న వారిపై నిరంతరం నిఘా ఉంటుందని వెస్ట్ ఏసీపీ దుర్గారావు హెచ్చరించారు. కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీటర్లు, క్రైం షీటర్లకు ఆదివారం కౌన్సెలింగ్ ఇచ్చారు. వినాయక చవితి ఉత్సవాల నేపథ్యంలో ఊరేగింపులు, నిమజ్జనాల సందర్భంగా ఎటువంటి గొడవలకు పాల్పడినా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. చుట్టు పక్కల ఏదైనా గొడవ జరిగినా, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. అలా కాని పక్షంలో ఆయా ఘటనల్లో ఎవరి పాత్ర ఎంత ఉందో తెలుసుకుని కఠినంగా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కొత్తపేట సీఐ చిన కొండలరావు, ఎస్ఐలు పాల్గొన్నారు.

బాబు మోసాలను తిప్పికొట్టాలి

- వైఎస్సార్ సీపీ పెనమలూరు నియోజక వర్గ సమన్వయకర్త దేవభక్తుని చక్రవర్తి
- మారేడుమాక, మంతెనలో 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ'



క్యూఆర్ కోడ్‌లను ఆవిష్కరిస్తున్న దేవభక్తుని చక్రవర్తి, ఇతర నేతలు



మోహన్‌రావును సత్కరిస్తున్న దేవభక్తుని చక్రవర్తి

కంకిపాడు: చంద్రబాబు మోసాలను తిప్పికొట్టాలని వైఎస్సార్ సీపీ పెనమలూరు నియోజకవర్గ సమన్వయకర్త దేవభక్తుని చక్రవర్తి అన్నారు. మండలంలోని మారేడుమాక, మంతెన గ్రామాల్లో బాబు ష్యూరిటీ– మోసం గ్యారెంటీ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ మోసపూరిత విధానాలను వివరిస్తూ రూపొందించిన క్యూఆర్ కోడ్ బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఆయా గ్రామాల్లో నిర్వహించిన సమావేశాల్లో చక్రవర్తి మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి ప్రభుత్వం పాలన సాగిస్తోందన్నారు. సూపర్‌సిక్స్ పేరుతో ప్రజలను మోసం చేయటం కూటమికే చెల్లిందన్నారు. చెప్పిన మాటలకు, పాలనకు ఏ మాత్రం పొంతన లేదన్నారు. అడుగడుగునా అరాచకాలు సృష్టిస్తూ రెడ్ బుక్ రాజ్యాంగంతో ఇష్టారాజ్యంగా పాలన సాగిస్తున్న ఘనత చంద్రబాబు ప్రభుత్వానిదేనన్నారు. సంపద సృష్టి, ఉద్యోగాల కల్పనతో పేరుతో ప్రజల ఆశలను ఛిద్రం చేస్తున్నారని ధ్వజమెత్తారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అర్హులందరికీ సంక్షేమం దరిచేరిందన్నారు. ఇచ్చిన మాటకు అనుగుణంగా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగించారని గుర్తు చేశారు. అన్ని వర్గాలకూ మెరుగైన సంక్షేమ పాలన అందించారన్నారు. వైఎస్సార్ సీపీని క్షేత్ర స్థాయిలో బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. జగనన్నకు బాసటగా నిలిచి ప్రభుత్వ వైఫల్యాలను ఇంటింటికీ తీసుకెళ్లి ప్రజలను చైతన్యం చేయాలని కోరారు.

మారేడుమాక గ్రామ పార్టీ సమావేశం

ఈ సందర్భంగా మారేడుమాక గ్రామ పార్టీ సమావేశం నిర్వహించారు. గ్రామ పార్టీ అధ్యక్షుడిగా వీర్ల మోహన్‌రావును ఎన్నుకున్నారు. మరికొందరితో కూడిన కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ ప్రతినిధులను చక్రవర్తి ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు బాకీ బాబు, మండల పరిషత్ అధ్యక్షురాలు మాదు శ్రీహరిరాణి, మహిళా విభాగం రాష్ట్ర రామినేని రమాదేవి, బీసీ విభాగ రాష్ట్ర నేత నక్కా శ్రీనివాసరావు, జిల్లా అధికార ప్రతినిధి నత్తా వెంకటేశ్వరరావు, పలువురు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

తాగునీటి కోసం కాలనీ వాసుల పడిగాపులు

- వీఎస్.పురం కాలనీ వాసుల ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు



తాగునీటి కోసం పడిగాపులు పడుతున్న కాలనీ వాసి

వీఎస్.పురం(గన్నవరం): మండలంలోని కేసరపల్లి శివారు వెంకటనరసింహాపురం కాలనీవాసులు గత కొన్ని రోజులుగా తీవ్ర తాగునీటి ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. కాలనీలో కొత్తగా ఏర్పాటు చేస్తున్న విద్యుత్ స్తంభాల కోసం రహదారుల పక్కన గుంతలు తవ్వుతున్నారు. గుంతలు తవ్వే క్రమంలో పలుచోట్ల భూమిలోని తాగునీటి సరఫరా పైపులైన్లు పగిలిపోయాయి. దీంతో తాగునీటి సరఫరాకు ఆటంకం ఏర్పడింది. విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేస్తున్న కాంట్రాక్టర్ మాత్రం పైపులైన్లకు మరమ్మతులు చేయించకుండా వదిలివేశారు. దీంతో కుళాయి నీరు రాకపోవడంతో కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 2,3 కుటుంబాలు కలిసి రూ.600 ఇచ్చి ట్యాంకర్ నీరు తెప్పించుకుంటున్నారు. గ్రామ పంచాయతీ అధికారులైనా స్పందించి మరమ్మతులు చేపట్టి తాగునీటి సరఫరాను క్రమబద్ధీకరించాలని కోరుతున్నారు.

బుడమేరు కన్నీటి కష్టాలకు 'సంవత్సరీకం'

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సీహెచ్ బాబూరావు



సమావేశంలో మాట్లాడుతున్న సీహెచ్ బాబూరావు, దోనేపూడి కాశీనాథ్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): బుడమేరు ముంపు నివారణకు ఏడాది కాలంలో కేటాయించిన నిధులు, చేపట్టిన పనులపై శ్వేత పత్రం విడుదల చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సీహెచ్ బాబురావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడలోని సీపీఎం జిల్లా కార్యాలయంలో ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు, రాష్ట్ర కమిటీ సభ్యుడు దోనేపూడి కాశీనాథ్ మాట్లాడారు. గతేడాది ఆగస్టు 31, సెప్టెంబర్ ఒకటో తేదీన బుడమేరు వరదలతో విజయవాడ నగరంలోని లక్షలాదిమంది నిరాశ్రయులయ్యారని, నరకయాతన అనుభవించారని గుర్తు చేశారు. నాడు ముందస్తు హెచ్చరికలు చేయడంలో ప్రభుత్వం విఫలమయిందని చెప్పారు. దాదాపు 50 మంది మరణించారని, రూ.వేల కోట్ల ఆస్తి నష్టం జరిగిందన్నారు. విజయవాడ, ఎన్టీఆర్, కృష్ణా జిల్లాలు ప్రజల జీవితాలు అతలాకుతులం అయ్యాయని పేర్కొన్నారు. ఆ దెబ్బ నుంచి ప్రజలు నేటికీ పూర్తిగా కోలుకోలేదన్నారు. వరదల సమయంలో హడావిడి చేసిన సీఎం చంద్రబాబు బుడమేరు ముంపు ప్రమాదం కాపాడే చర్యలు చేపట్టడంలో పూర్తిగా విఫలం చెందారని విమర్శించారు. ఏడాది కాలంలో రూ.30 కోట్ల ఖర్చుతో ఒకచోట గండి పూడ్చి, గోడ నిర్మించడం తప్ప చేసిందేమీ లేదన్నారు. నష్టపోయిన బాధితులు, వ్యాపారులు, చిన్న పరిశ్రమలు, కార్మికులకు పరిహారం చెల్లింపులోనూ ప్రభుత్వం వెనుకబడిందన్నారు. తక్షణం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రూ.10వేల కోట్లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈనెల 30న నిరసన కార్యక్రమం చేపడుతున్నామన్నారు.

జానపద కళలను పరిరక్షించుకోవాలి



విజయవాడ కల్చరల్: జానపద కళలను పరిరక్షించుకోవాలని ఆధ్యాత్మికవేత్త వేముల హజరత్తయ్య గుప్తా అన్నారు. దామోదర జానపదం, దేశికా ఆర్ట్స్, మామ్ ట్రస్ట్, లోక కళాపరిషత్ ఆధ్వర్యాన అంతర్జాతీయ జానపద దినోత్సవం సందర్భంగా ఆదివారం తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జానపదం, ఆట–పాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న గుప్తా మాట్లాడుతూ జానపద గీతాలు తెలుగు వారి ఆత్మ అని అభివర్ణించారు. జనుల హృదయాన్ని కదిలించేది జానపదమని తెలిపారు. జానపద గాయకుడు దామోదర గణపతిరావు మాట్లాడుతూ జానపదం జనపదం అని అభివర్ణించారు. గాయకులు పలు జానపద గీతాలను ఆలపించారు. అనంతరం వేముల హజరత్తయ్య గుప్తా, సుశీల్ కుమార్, భారతి, రమణ, ఎస్. కృష్ణవేణి, రెడ్డి ప్రసాద్, బండి ఉషారాణి, పి.వెంకటరమణ, వైష్ణవి, అత్తలూరి విజయలక్ష్మి తదితరులకు కృష్ణవేణి జానపద సేవా పురస్కారాలను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే గద్దె రామ్మోహనరావు, బొండా జగన్మోహనరావు, మాసాబత్తుల శ్రీనివాస్, మహంతి వాసుదేవరావు, లింగా శ్రీనివాస్ పాల్గొన్నారు.

సాంకేతిక రంగాల్లో విద్యార్థులకు నైపుణ్యాలను అందిస్తాం



కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు, అధ్యాపకులు

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలోని వికాస్ గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్స్‌లో ఆదివారం చెన్నైకి చెందిన నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, మినిస్ట్రీ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్, కౌన్సిల్ ఫర్ స్కిల్స్ అండ్ కాంపిటెన్సీస్ సంయుక్త ఆధ్వర్యంలో మొబిలైజేషన్ క్యాంప్ జరిగింది. క్యాంప్ ప్రారంభించిన కళాశాల సెక్రటరీ ఎస్.సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ ఆధునిక సాంకేతిక రంగాల్లో విద్యార్థులకు నైపుణ్యాలను అందిస్తామన్నారు. ముఖ్యంగా వీఎల్ఎస్ఐ అండ్ డిజైన్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సైబర్ సెక్యూరిటీ, క్లౌడ్ కంప్యూటింగ్, డేటా ఇంజినీరింగ్ వంటి రంగాల్లో విద్యార్థులు ప్రావీణ్యం సాధించేందుకు గొప్ప అవకాశంగా పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ నేషనల్ పాలసీ ఆన్ ఎలక్ట్రానిక్స్, ఇండియా సెమి కండక్టర్ మిషన్‌కు అనుగుణంగా కార్యక్రమం రూపొందించ బడిందన్నారు. ఈ కార్యక్రమంలో 200 మంది విద్యార్థులు, వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు. 150 మంది విద్యార్థులు వివిధ కోర్సుల్లో ఉచితంగా నమోదు చేసుకున్నారు. ఈ కోర్సులకు గాను రూ.24,500 ఖర్చు అవుతుందని, అయితే ఉచితంగా విద్యార్థులకు అందించడం జరిగిందని ప్రిన్సిపాల్ తెలిపారు. ఐఐటీ మద్రాస్ నిపుణులచే 30 రోజుల హ్యాండ్– ఆన్ ట్రైనింగ్ కూడా అందుబాటులోకి తీసుకొస్తున్నామన్నారు. ఇది విద్యార్థుల కెరీర్‌కు ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. సీనియర్ కన్సల్‌టెంట్ వై.రామ్మోహనరావు, హెడ్ అండ్ సీఈవో, డేటా వ్యాలీ ఆర్గనైజేషన్ కె.మురళి క్యాంప్ ప్రాముఖ్యతను వివరించారు.


పొలిమేర వాగులో కదలని మురుగు



ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిన పొలిమేర వాగు

గన్నవరం: మండలంలోని దావాజిగూడెం, అల్లాపురం గ్రామాల మధ్య ఉన్న పొలిమేర వాగు పూర్తిగా పిచ్చి మొక్కలు, ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్త చెదారంతో నిండిపోయింది. దీంతో వాగులో మురుగునీటి పారుదల ముందుకు కదలని పరిస్థితి నెలకొంది. దీనివల్ల మురుగునీరు ఎక్కడికక్కడ నిలిచిపోయి తీవ్ర దుర్వాసన వెదజల్లుతోంది. దోమల బెడదతో పరిసర ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వివరాలీలా ఉన్నాయి. ఈ రెండు గ్రామాల మధ్య సుమారు కిలోమీటర్ పొడవునా పొలిమేర వాగు విస్తరించి ఉంది. రమణమ్మ చెరువు నుంచి వర్షం నీరు ఈ వాగు ద్వారా ఏలూరు కాలువ దిగువన ఉన్న డ్రెయిన్‌లో కలుస్తుంది. అయితే గత కొన్నేళ్లుగా ఈ వాగులో పూడికలు తొలగించకపోవడంతో పాటు ఆక్రమణలకు గురై కుదించుకు పోయింది. పిచ్చిమొక్కలు, పచ్చగడ్డి దట్టంగా పెరిగిపోవడంతో వాగు రూపురేఖలను కోల్పోయింది. ఇళ్లలోని ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్తచెదారం పడవేయడంతో వాగు పూడుకుపోయింది. దీనివల్ల మురుగునీటి పారుదల సక్రమంగా జరగడం లేదు. దోమల ఉత్పత్తి కేంద్రంగా మారిందని పరిసర ప్రజలు వాపోతున్నారు. ఇరు గ్రామాలకు చెందిన పాలకులు, అధికారులు స్పందించి పొలిమేర వాగు ప్రక్షాళనకు చర్యలు తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

మొక్కల పెంపకంతో కాలుష్యం నివారణ



స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటుతున్న పటమట సీఐ పవన్ కిషోర్, ప్రిన్సిపాల్ డాక్టర్ కోసిరెడ్డి వీర్రాజు

పటమట(విజయవాడతూర్పు): విద్యార్థి దశలోనే ప్రకృతి, పర్యావరణంపై అవగాహన పెంచుకుని వాతావరణ కాలుష్యాన్ని నిరోధించేందుకు మొక్కలు నాటడం అలవాటుగా చేసుకోవాలని పటమట సీఐ పవన్ కిషోర్ తెలిపారు. బెంజిసర్కిల్ వద్ద ఉన్న ఆదిత్య కళాశాల విద్యార్థులతో ఆదివారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. పవన్ కిషోర్ మాట్లాడుతూ నాటిన తర్వాత వాటిని పర్యవేక్షించాల్సిన బాధ్యత కూడా తీసుకోవాలని సూచించారు. విద్యార్థులతో కలిసి ఆయన మొక్కలు నాటారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కోసిరెడ్డి వీర్రాజు మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యాక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అనే ఇతివృత్తంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ గాయత్రి, కళాశాల చైర్మన్ డాక్టర్ ఎస్.శేషారెడ్డి, సుగుణరెడ్డి పాల్గొన్నారు.

కిషోర్‌కు మదర్ థెరిస్సా ప్రేరణ పురస్కారం

భవానీపురం(విజయవాడపశ్చిమ): మదర్ థెరిసా జయంతిని పురస్కరించుకుని విద్యాధరపురం కబేళా సెంటర్ బ్రహ్మయ్య కాలనీకి చెందిన వెంకట్ మహేశ్వర్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక చైర్మన్ ముత్తంశెట్టి దుర్గా కిషోర్‌కు మదర్ థెరిసా జాతీయ ప్రేరణ పురస్కారం లభించింది. మదర్ థెరిసా ఎడ్యుకేషనల్ సొసైటీ వార్షికోత్సవం సందర్భంగా అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం సీఆర్‌సీ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం ఆయనకు ఈ పురస్కారాన్ని ప్రదానం చేశారు. సొసైటీ చైర్మన్ డాక్టర్ దిడ్ల కిషోర్, డాక్టర్ వడియార్, సీఆర్‌సీ రూపకర్త విక్టరీ వెంకట్రామిరెడ్డి, సీఐ రమణమ్మ చేతుల మీదుగా దుర్గా కిషోర్ పురస్కారాన్ని అందుకున్నారు. వెంకట్ మహేశ్వర్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా సేవా కార్యక్రమాలు చేస్తున్న కిషోర్ అభినందనీయులన్నారు.

ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసేలా ఉత్సవాల నిర్వహణ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్ర వ్యాప్తంగా గణపతి నవరాత్రి ఉత్సవాలు ఆధ్యాత్మిక శోభ, మతసామరస్యం వెల్లివిరిసేలా నిర్వహించాలని గణపతి నవరాత్రి ఉత్సవ సమితి రాష్ట్ర కార్యదర్శి ప్రసాదరాజు, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు పాకాల త్రినాథ్ రాజు తెలిపారు. ఆదివారం ఎన్టీఆర్ జిల్లా గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో రాష్ట్ర కార్యాలయంలో మండప నిర్వాహకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండపాల విషయంలో వచ్చే సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళుతున్నామని చెప్పారు. సింగిల్ విండో ద్వారా అనుమతులకు ప్రభుత్వం అంగీకరించిందని తెలిపారు. మండపాల్లో అసభ్య పాటలు, రాజకీయ అంశాలు లేకుండా ఉత్సవాలు నిర్వహించాలని కోరారు. సింగిల్ విండో విధానంలో సమస్యలు వస్తే సమితి పరిష్కరిస్తుందన్నారు. అవసరమైతే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. కార్యదర్శి దుర్గాప్రసాద్ రాజు, త్రిమూర్తి రాజు మాట్లాడుతూ పోలీస్ యంత్రాంగం పరిశీలన తర్వాత ఎన్ఓసీ జారీ చేస్తుందన్నారు. ఉత్సవాలకు సంబంధించిన భక్తి గీతాలను త్వరలో విడుదల చేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో ఉపాధ్యక్షుడు బిట్ర వెంకటేశ్వరరావు, కార్యదర్శి నాసా శ్రీనివాస్, గౌరవాధ్యక్షుడు రావి కృష్ణారావు, బాలకృష్ణ, సంజయ్ మెహతా, వల్లపు రాజా తదితరులు పాల్గొన్నారు.